క్లుప్తంగా

మోటార్ సైకిల్ ఢీకొని వైద్యుడికి గాయాలు

భీమవరం: భీమవరం టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చినఅమిరం గ్రామ సమీపంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న డాక్టర్‌ను మరొక మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయపడినట్లు ఎస్సై ఇబ్రాయిల్ ఆదివారం చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్లకు చెందిన డాక్టర్ వలి గంగాధర్‌కుమార్ రెడ్డి కొంతకాలంగా భీమవరం పట్టణంలోని ఇంపీరియల్ ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం చినఅమిరం గ్రామం నుంచి తన మోటారు సైకిల్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరొక మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇబ్రాయిల్ చెప్పారు.

వృద్ధులకు ఇంటింటికీ వైద్యం



వృద్ధుడి ఇంటికెళ్లి వైద్యసేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్యం కార్యక్రమంలో భాగంగా సీనియర్ వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వృద్ధులకు వైద్య సేవలు అందించారు. తణుకు, ఉండ్రాజవరం ప్రాంతాల్లో ప్రత్యేక వాహనంలో పర్యటించి ఐదుగురు వృద్ధులకు వైద్యం చేశారు. సభ్యులు కె.రామమోహనరావు సౌజన్యంతో ఉచితంగా మందులు అందచేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గోగులమ్మకు విశేష పూజలు



గోగులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కడకట్ల 32వ వార్డులో వేంచేసియున్న గోగులమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు నిర్వహించారు. అమ్మవారికి పుట్టింటి వారు, అత్తింటి వారు నైవేద్యాలు సమర్పించారు. రాత్రి పూరి గుడిసె (పుట్టిల్లు) నుంచి ఊరేగింపుగా ప్రధాన ఆలయం (అత్తిల్లు)కు అమ్మవారిని చేర్చారు. సేవా సమితి కమిటీ నిర్వాహకులు రామిశెట్టి సురేష్ పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పెనుగొండ: నడిపూడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, నాలుగు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో నడిపూడికి చెందిన పుల్ల శ్రీనును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సై మధుబాబు, కానిస్టేబుల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు



యర్రంశెట్టివారిపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారిపాలెంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యర్రంశెట్టి శ్రీనివాసరావు, యర్రంశెట్టి భార్గవ దంపతులు ఆలయ పూజారి సూర్య కిరణ్ బ్రహ్మత్వంలో కల్యాణం, చక్రస్నానం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా అన్నసమారాధన

నరసాపురం: హనుమద్ జయంతి ముగింపు వేడుక సందర్భంగా పట్టణంలోని 31వ వార్డు చినమామిడిపల్లి ఆంజనేయస్వామి గుడి వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 3 వేల మంది అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాటు పర్యవేక్షించారు.

రోడ్లపై విచ్చలవిడిగా పశువుల సంచారం

- కదిలే స్పీడు బ్రేకర్లులా ఉన్నాయని ప్రజల ఆవేదన
- ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు



గుట్లపాడులో రాత్రి సమయంలో మెయిన్‌రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

భీమవరం అర్బన్: రోడ్లపై అడ్డదిడ్డంగా తిరిగే పశువుల కారణంగా నిత్యం ప్రజలకు, వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో కొత్తపూసలమర్రు, గూట్లపాడు, దొంగపిండి, గొల్లవానితిప్ప గ్రామాలలో మెయిన్ రోడ్డులోనే కాకుండా ఏ వీధిలో చూసిన వందలాది ఆవుల మంద కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలపై వెళ్లే సమయంలో అకస్మాత్తుగా రోడ్లపైకి వచ్చే పశువులతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతే కాకుండా స్కూల్‌కి వెళ్లే విద్యార్థులను ఆవుల కొమ్ములతో పొడిచి గాయపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు బారిన పడుతున్నవారి సంఖ్య రోజూ పెరుగుతూనే ఉంటుంది. ఆయా గ్రామాలలో ఆవుల యజమానులు కట్టకుండా పాలు తీసుకుని రోడ్లపైకి వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రిళ్లు రోడ్లపై గుంపులుగా ఆవులు వాహనాలకు అడ్డుగా నిలబడటమే కాకుండా ప్రమాదాలకు కారణమవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. వాహనదారులు హారన్ కొడుతున్నప్పుడు పశువులు భయంతో పరుగులు పెడుతూ ద్విచక్ర వాహనాలపై దూసుకువస్తున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో వైద్య ఖర్చులకు, వాహనాల మరమ్మతులకు తడిసిమోపెడవుతుందని పలువురు వాపోతున్నారు.

ప్రధాన కూడళ్లల్లో భయపెడుతున్న ఆవులు

కొత్తపూసలమర్రు, గూట్లపాడు, గొల్లవానితిప్ప గ్రామాలలో మెయిన్ రోడ్లపై వందలాది ఆవులు గుంపులుగా తిరుగుతూ వాటి కొమ్ములతో దాడి చేస్తున్నాయని పలువురు గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో తమ పిల్లలను రోడ్లపైకి పంపించాలంటే భయమేస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అలాగే మండలంలో రొయ్యలు, చేపలు చెరువులు ఎక్కువగా ఉండటంతో పశుగ్రాసం కోసం ఆవులు మందలుగా గట్లపై తిరుగుతూ గట్లను ధ్వంసం చేస్తున్నాయని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

వందలాది ఆవులు రోడ్ల పైకి వచ్చి దాడులు చేస్తున్నా పంచాయతీ అధికారులు, పాలక వర్గ సభ్యులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తున్నాయి. పశువులను గ్రామంలో లేకుండా దూరంగా తోలుకుని వెళ్లాలని లేకుంటే బందెల దొడ్డి ఏర్పాటు చేసి పశువుల యజమానులకు జరిమానాలు విధించాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆవుల యజమానులకు నోటీసులు ఇచ్చి హెచ్చరించాలని ఆయా గ్రామస్తులు కోరుకుంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం: భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి కారణంగా సోమవారం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని నర్సయ్య అగ్రహారం, కుముదవల్లి రోడ్డు తదితర ప్రాంతాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని స్పష్టం చేశారు. వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

వైభవంగా లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం

యలమంచిలి: మండలంలోని కొంతేరు శ్రీకుంతీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ బ్రహ్మత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారి రథోత్సవం సన్నాయి మేళాలు, బాణసంచా కాల్పుల మధ్య అత్యంత వైభవంగా సాగింది. రాత్రి ఆలయంలో సదస్యం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ మల్లుల రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థానం మాజీ చైర్మన్ అడ్డాల సత్యనారాయణ, గ్రామ పెద్దలు మంచెం పుల్లారావు, అందే వీర రాఘవులు, వర్ధినీడి మణికంఠ, అడ్డాల రామకృష్ణ, తోలేటి భీమేశ్వరరావు పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తణుకు అర్బన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తణుకు శాఖ నూతన కార్యవర్గం ఆదివారం స్థానిక గమిని ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ముందుగా జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా కడించర్ల రాజరాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా అక్కిన కాశీ విశ్వనాథం, కార్యదర్శిగా కఠారి కాశీ విశ్వనాధ రాజు, కోశాధికారిగా వంగూరి హనుమంతరావు, సహాయ కార్యదర్శిగా ఒబిలిశెట్టి మురళీ హరినాథ్, కార్య నిర్వాహక సభ్యులుగా ఆర్‌ఎస్‌ఎం భూపాల్, డాక్టర్ కె.రామలక్ష్మి, యలమర్తి శ్రీనివాసరావు, నిడదవోలు సత్తిరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ మానవత సేవలు మానవత్వాన్ని చూపిస్తున్నాయని, ముఖ్యంగా దాతలు అందిస్తున్న దాతృత్వం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కఠారి శారదాదేవి, మానవత విస్తరణ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి పాల్గొన్నారు.

బస్సులు ఆగని బస్టాండ్



వీరవాసరం ఆర్టీసీ బస్టాండ్ దుస్థితి



కూర్చోవడానికి సైతం అనువుగా లేని బస్టాండ్ పరిసరాలు

అధ్వానంగా మారిన వీరవాసరం బస్టాండ్

వీరవాసరం: పేరుకే బస్టాండు..ఆ బస్టాండ్ సమీపంలో ఏ ఒక్క ఆర్టీసీ బస్సులు ఆగిన దాఖలాలు కానరావు.. మండల కేంద్రమైన వీరవాసరం తూర్పు చెరువు సెంటర్ లో గడిచిన 15 సంవత్సరాల క్రితం నుంచి ఆర్టీసీ బస్టాండు ఉంది. ప్రారంభించిన కొత్తల్లో అన్ని డిపోల బస్సులు బస్టాండ్ సమీపంలో ఆగేవి. ప్రయాణికులను ఎక్కించుకుని రాకపోకలు సాగించేవి. రానురానూ ఆర్టీసీ బస్టాండ్‌లో కొన్ని ఆర్టీసీ బస్సులు ఆగకుండా మరీ వెళ్లిపోతున్నాయి. లేదంటే ఆర్టీసీ బస్టాండ్‌కి కొంత దూరంలో ఆగి ప్రయాణికులను ఎక్కించుకోకుండానే రాకపోకలు సాగిస్తున్నాయి. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ వాహనాలు సైతం పెద్ద ఎత్తున అడ్డంగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాదిమంది ప్రయాణికులు ఈ బస్టాండ్ సమీపంలో నుంచి ప్రయాణాలు, రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో ఆకకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు.

మౌలిక వసతులు కరువు

వీరవాసం బస్టాండ్ అస్తవ్యస్తంగా, కూర్చోవడానికి వీలు లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో ఉంది. బస్టాండ్ లో ఉన్న టాయిలెట్లు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం టాయిలెట్స్‌లో నీటి వసతి లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుంది. తాగునీటి ఏర్పాట్లు కూడా సక్రమంగా లేవు. దీంతో బస్టాండ్ లో కూర్చోవాలంటేనే ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో ఆగకపోవడం ఒకపక్క అయితే ,మరో పక్క ప్రయాణికులు బస్టాండ్ లో కూర్చోవడానికి ముక్కులు మూసుకుని ఉండాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి బస్టాండ్ ప్రాంతంలో బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని, బస్టాండ్‌లో బస్సులు ఆగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

> **బస్టాండ్‌కు బస్సులు రావు**
>
> వీరవాసరం తూర్పు చెరువు సెంటర్ లో ఉన్న బస్టాండ్ లో కూర్చోవాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. తప్పుజారి బస్టాండ్ దగ్గర కూర్చుని ఉంటే అక్కడ ఆర్టీసీ బస్సులు ఆగని పరిస్థితి దాపురించింది. ఆగితే ఏదో బస్టాండ్‌కి కాస్త దూరంలో ఆగి, తూతూ మంత్రంగా వెళ్లిపోతుంటాయి. ప్రయాణికులు నరకం అనుభవించాల్సి వస్తుంది. షేర్ ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి
>
> – కె.సూర్యనారాయణ, వీరవాసరం

వడ్రంగి కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



వడ్రంగి కార్మికులకు జ్ఞాపికలు అందిస్తున్న రాజ్య సభ సభ్యుడు పాకా సత్యనారాయణ

భీమవరం: జిల్లాలో వడ్రంగి కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేయూతనందించాలని జిల్లా వండ్రంగి పనివారల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిట్టిమోజు భోగేశ్వరరావు, చిప్పాడ చంద్రశేఖర్ అన్నారు. జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆదివారం భీమవరం మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 24 లక్షల మంది వడ్రంగి కార్మికులున్నారని ప్రభుత్వ పరంగా ఎటువంటి సహాయం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్రంగి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై కమిటీ సభ్యులతో ప్రమాన స్వీకారం చేయించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి లక్కోజు సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షులు అరసవల్లి రామచంద్రరావు, వెంకటాపు శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులు చింతోజు పాండురంగాచార్యులు, ములగాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు నిర్వహణపై అవగాహన



ఆయిల్ పామ్ సాగుపై రైతాంగానికి అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో ఆదివారం ఆయిల్‌పామ్ సాగు నిర్వహణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్ రీసెర్చ్ (ఐఐవోపీఆర్, పెదవేగి) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు మాట్లాడుతూ ఆయిల్‌పాం తోటలకు బాగా ఒడ్డు కట్టే మట్టి అనుకూలమని పేర్కొన్నారు. నీటి పారుదల, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి వృథా తగ్గుతుందన్నారు. వర్షా కాలంలో నీరు నిల్వ చేయడానికి ట్రెంచ్ పద్ధతిని అనుసరించాలని సూచించారు. సేంద్రియ ఎరువులు, రసాయనిక ఎరువులు సమతుల్యంగా వినియోగించాలన్నారు. సూక్ష్మ పోషకాలు లోపించకుండా చూడాలన్నారు. అలాగే కీటకాలు, రోగ నివారణ, అంతర పంటలు, కోకో పంట నిర్వహణ తదితర అంశాలపై రైతాంగానికి అవగాహన కల్పించారు. ప్రగతి శీల రైతులు, గ్రామ సభ్యులు హేమ, జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ వంశీ, వీహెచ్‌ఏ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న యోగ సాధకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాను ప్రతి ఒక్కరూ అభ్యసించి, సాధన చేయాలని, తద్వారా ఆరోగ్యం సాధ్యమవుతుందని యోగ గురువు బడుగు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్ ఆవరణలో ఆదివారం శ్రీ సత్యసాయి ధ్యాన మండలి నిత్య యోగా సాధన కేంద్రం ఆధ్వర్యంలో అభ్యసకులు పలు యోగా ఆసనాలు వేశారు. సీనియర్ యోగా సభ్యులను సత్కరించారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహించామని ఆయన తెలిపారు. అదే విధంగా సచివాలయం పరిధిలో మెడికల్ శిబిరం నిర్వహించారు. యోగా సాధకులు బీపీ పరీక్షలు చేయించుకున్నారు.

రావిపాడులో నేడు ర్యాలీ

పెంటపాడు: రావిపాడు గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటలకు మెగా యోగా ర్యాలీ నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి శేఖర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, సొసైటీ సిబ్బంది, మెడికల్, ఫీల్డ్ సహాయకులు, అన్ని శాఖల ఉద్యోగులు తప్పక పాల్గొనాలని ఈ సందర్భంగా కార్యదర్శి కోరారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

నరసాపురం రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. అమ్మవారి జాతర సోమవారం జరుగుతుండడంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆదివారం తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీతో నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేసి అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు, దేవాదాయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఎట్టకేలకు జాతీయ రహదారికి మరమ్మతులు



ఆకివీడు నుంచి భీమవరం వరకూ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఆకివీడు: జాతీయరహదారి నెం.165కు ఎట్టకేలకు మరమ్మతులు ప్రారంభించారు. రెండున్నర దశాబ్దాలుగా రహదారి పునర్నిర్మాణం జరగలేదు. విస్తరణ ఊసేలేదు. ఏళ్ల తరబడి ప్రజలు, ప్రయాణీకులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నా ఆ శాఖ అధికారులకు గానీ ప్రజా ప్రతినిధులకు గానీ పట్టలేదు. 1995 ప్రాంతంలో ఆర్ అండ్ బీ రహదారుల శాఖపరిధిలో పాలకొల్లు-పామర్రు(పీపీ) రోడ్డుగా ప్రసిద్ధి చెందిన ఈ రోడ్డును అప్పటి ఎంపీ కనుమూరి బాపిరాజు జాతీయ రహదారుల శాఖలో విలీనం చేశారు. పామర్రు-దిగమర్రు రోడ్డుగా దీనిని జాతీయరహదారుల శాఖ గుర్తించింది. తదనంతరం రహదారికి ఒక లేయర్ నిర్మాణ పనులు చేపట్టారు. అప్పటి నుంచి నేటి వరకూ ప్రజా ప్రతినిధులు మారుతున్నా, జాతీయ రహదారుల శాఖ అధికారులు బదిలీ అవుతున్నా సమస్య మాత్రం అంగుళమైనా కదలలేదు. రహదారికి ఇరువైపులా ప్రపంచ బ్యాంక్ నిధులతో అప్పట్లోనే పక్కా డ్రెయినేజీని కొంత మేర నిర్మించారు. ప్రస్తుతం ఆ డ్రెయిన్ అక్కడక్కడా కన్పిస్తుంది. రహదారి విస్తరణ పనులు చేపట్టకపోవడంతో వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గతుకుల రోడ్లు, గుంతలు గుంతలుగా ఏర్పడ్డ రోడ్డుతో ప్రజలు విసుగెత్తిపోయారు. అదే పరిస్థితి నేటికీ కొనసాగుతోంది.

సాక్షి కథనాలతో కదలిక

జాతీయ రహదారి నె. 165 అభివృద్ధి, విస్తరణ కోసం ‘సాక్షి’లో పలుసార్లు కథనాలు వెలువడ్డాయి. ఇటీవల ఈ విషయం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ దృష్టికి సమస్య వెళ్లడంతో రహదారి మరమ్మతులను అధికారులు చేపట్టారు. అలాగే విస్తరణ పనులను కూడా వేగంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఉప్పుటేరు వంతెన వద్ద నుంచి భీమవరం వరకూ రహదారి నాలుగు లైన్ల విస్తరణకు సరిపడే స్థలం ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కొన్ని చోట్ల ఆక్రమణలకు గురయ్యాయి.

మరో పదేళ్లు పైబడే..

జాతీయరహదారి 165 బైపాస్ రోడ్ల వెంబడి విస్తరణ పనులు చేపట్టి, పూర్తి చేసేందుకు మరో పదేళ్ల పైబడి పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. స్థానిక ఉప్పుటేరు వంతెన వద్ద నుంచి బైపాస్ రోడ్డు అయిభీమవరం, అజ్జమూరు, పెదపుల్లేరు, జక్కరం మీదుగా పెదపుల్లేరు చిన్నమిరం మీదుగా తాడేరు, విస్సాకోడేరు తదితర ప్రాంతాల గుండా వెళ్లనుంది. ఆయా ప్రాంతాల్లో భూ సేకరణ, పూడిక పనులు, కల్వర్టులు, వంతెనల నిర్మాణం వంటి వాటితో మరో 10 ఏళ్ల వరకూ జాతీయ రహదారి బైపాస్ పూర్తి అయ్యే అవకాశం కన్పించడంలేదని పలువురు పేర్కొంటున్నారు. ఉప్పుటేరు వద్ద నుంచి అజ్జమూరు వరకూ భూ సేకరణ పూర్తయ్యింది. భూసేకరణ కోసం లబ్ధిదారులకు సొమ్ము చెల్లించేందుకు సుమారు ఐదేళ్లు పట్టింది. అజ్జమూరు నుంచి పలు గ్రామాల్లో భూ సేకరణ జరగాల్సి ఉంది. ఎన్‌హెచ్ 165 మార్గాన్ని పూర్తిగా మళ్లించడంతో పాత రోడ్డు పరిస్థితి ఏంటి? అనేది సందిగ్ధంగా ఉంది.

నేడు రామలింగేశ్వరుని ఆలయంలో సప్త ప్రదక్షిణలు



క్షీరారామలింగేశ్వరస్వామి

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 9వ తేది సోమవారం సప్త సోమవారాలు, సప్త మారేడు దళములతో ప్రదక్షిణాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ప్రదోషకాల సమయంలో అంటే సాయంత్రం 5.30 గంటలకు ఈ ప్రదక్షిణలు ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తున్న నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలు నుంచి కార్యక్రమంలో ప్రారంభం అవుతుందని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులను అందించాలని కోరారు.